# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు విడుదల చేస్తారు.**
2. **ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.**
3. **భవిష్యత్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్ మహానగర పాలక సంస్థని నాలుగు కార్పొరేషన్లుగా మార్చనున్నామని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.**
4. **దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈరోజు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**
5. **ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు విడుదల చేయనున్నారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి వాషిమ్‌లో ఈ నిధులను విడుదల చేస్తారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాన్ని పొందనున్నారు. అలాగే వాషిమ్‌లోని బంజారాల వారసత్వాన్ని చాటిచెప్పే బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం సుమారు 23 వేల 300 కోట్ల రూపాయలతో చేపట్టే వ్యవసాయ, పశుసంవర్ధక రంగానికి సంబంధించిన పలు కార్యక్రమాలను ఆయన ప్రారంభిస్తారు. సాయంత్రం థానేలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు.

--------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం చిన్నశేషవాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శమిస్తున్నారు. కాగా నిన్న రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు పెద్ద శేషవాహనంపై పరమపద వైకుంఠనాథుని అలంకారంలో తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహించారు.

ఇది ఇలా ఉండగా తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు గరుడపటాన్ని ఎగుర వేశారు.

తిరుమల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిన్న రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ....

వాయిస్ (34 సెకన్లు)

---

ఆంధ్రప్రదేశ్ ను 2047 నాటికి దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అవసరమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు అన్ని వర్గాల ప్రజల ఆలోచనలను పరిగణనలోనికి తీసుకుంటున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్ అభివృద్ధి సూచిక అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో అభివృద్ధిని సాధించడం ద్వారా రాష్ట్ర వృద్ధిరేటు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

---

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో నగరపాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కేంద్రమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. గుంటూరులో పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి 15 వ ఆర్థిక సంఘం నిధులనుండి 24 కోట్ల రూపాయలతో నూతన పారిశుధ్య వాహనాలు, సిబ్బందిని ఏర్పాటుచేస్తామని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 34 సెకన్లు )

---

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

అలాగే వికసిత్ బారత్ దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ప్రసారమవుతుంది.

---

తెలంగాణలో ధరణి పోర్టల్‌ను రద్దు చేసి త్వరలో హక్కుల నమోదు–రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టాన్ని తీసుకొస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవిన్యూ చట్టం అమలుపై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెలాఖరులోగా రికార్డ్ ఆఫ్ రైట్స్ కొత్త చట్టం అమల్లోకి తెస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించామని చెప్పారు.

---------------------------

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్ మహానగర పాలక సంస్థ–జీహెచ్ఎంసీని నాలుగు కార్పొరేషన్లుగా మార్చనున్నామని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. నిన్న హైదరాబాద్‌లో నిర్వహించిన పట్టణ మౌలిక సదుపాయాల సదస్సు లో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 30 వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రాంతీయ బాహ్య వలయ రహదారిని నిర్మించబోతున్నామని చెప్పారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా తెలంగాణలోని చాలా ప్రాంతాలలో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు.

---------------------------

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా కారంచేడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేసేలా ప్రజాహిత కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని అన్నారు. ప్రజల సౌకర్యార్థం శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.

---------------------------

విజయవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఈ రోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే అన్నపూర్ణ దేవిని దర్శించుకుంటే ఆకలిదప్పులు ఉండవని, సాక్షాత్తు పరమేశ్వరుడికే భిక్షపెట్టిన అన్నపూర్ణాదేవిని ధ్యానిస్తే ధనధాన్యవృద్ధి కలుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా శ్రీశైలం దసరా మహోత్సవాలలో భాగంగా గత రాత్రి భ్రమరాంబికాదేవి అమ్మవారు బ్రహ్మచారిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ రోజు నానబియ్యం బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

మనకు అక్షర జ్ఞానం పంచి, జీవితాన్ని స్వర్ణ మయం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను స్మరించుకునే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1966 అక్టోబర్ 5వ తేదీన మొదటి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయుల స్థితిగతులను చర్చించి, వారి సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని ఐక్య రాజ్య సమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక వ్యవహారాల సంస్థ–యూనెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థ –ఐఎల్ఓపారిస్‌లో అక్టోబర్ 5వ తేదీన జరిపిన సమావేశ తీర్మాన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

---------------------------

తిరుమల లడ్డూ కల్తీ అంశంపై అయిదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, స్వతంత్ర దర్యాప్తు బృందం ఏర్పాటు ద్వారా విచారణ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు.

ఇదిలా ఉండగా తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారనే ఆరోపణలపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల హర్షం వ్యక్తం చేశారు. ఈ అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని షర్మిల పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాను దేశంలో మిగతా ప్రాంతాలతో అనుసంధానం చేసేలా రైలు రవాణా వ్యవస్థ మరింత మెరుగు పరచవలసిన అవసరం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. నిన్న ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన ఖుర్దా రోడ్ డివిజినల్ రైల్వే మేనేజర్ సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి తెలుగు రాష్ట్రాల రాజధానులను కలిపేలా.. శ్రీకాకుళం, విజయవాడ మీదుగా సికింద్రాబాద్‌కు వందేభారత్ సెమీ హైస్పీడ్ స్లీపర్ క్లాస్ రైలు నడపాలని కోరారు. అలాగే పూరీ జగన్నాథ్ ఆలయాన్ని, తిరుమల ఆలయాన్ని అనుసంధానం చేసేలా పూరీ – తిరుపతి మధ్య వందేభారత్ రైలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి అధికారులకు సూచించారు.

======================